క్లుప్తంగా

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

వేమూరు: బాల్య వివాహాలను వ్యతిరేకించాలని ఐసీడీఎస్ అమర్తలూరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి విజయరాణి కోరారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం కార్యాలయంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సు జయమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజకుమారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంప్ పునఃప్రారంభానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్ పునఃప్రారంభం కాకపోవడంపై శుక్రవారం సాక్షిలో కథనం వెలువడింది. వైద్యాధికారి సయ్యద్ జెరీనా పర్వీన్ దీనిపై స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పలు విషయాలు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం సదరం క్యాంప్ నిర్వహించేవారని పేర్కొన్నారు. ఈ క్యాంప్‌నకు వచ్చిన దివ్యాంగులను జీజీహెచ్ ఆర్థోపెడిక్ డాక్టర్ పరీక్షించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేసేవారన్నారు. ఆయన అందుబాటులోకి వచ్చాక త్వరలోనే క్యాంప్ పునఃప్రారంభిస్తామని చెప్పారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు

చుండూరు (వేమూరు): చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో శ్రీ లలితాంబ సమేత శ్రీ స్వయం భువేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నిత్య హోమ విధులు, బలిహరణ జరిగాయి. 10వ తేదీన ఉదయం నిత్య హోమ విధులు, బలి హరణ, సాయంత్రం భృంగి వాహన సేవ, 11న ఉదయం నిత్య హోమ విధులు, బలిహరణ, సాయంత్రం ఎదురు కోల, 12వ తేదీన ఉదయం నంది వాహన గ్రామోత్సవం, సాయంత్రం దివ్య రథోత్సవం, 13వ తేదీన ఉదయం వసంత సేవ, త్రిశూల స్నానం, పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజారోహణము, మూకబలి, పుష్ప యాగోత్సవం, ప్రవశింపు సేవ తదితరాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



రేపల్లె: మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరుచూరి రామకృష్ణయ్య జ్ఞాపకార్థం స్థానిక ఎంసీఏ హాలులో శుక్రవారం ఇరువురు పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కేఎల్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువుతున్న పట్టణానికి చెందిన పి.లాస్య, నారాయణ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఎం. పూర్ణ శ్రీనివాస్‌లకు రూ.15 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి పి. శ్రీనివాసరావు, సభ్యులు శ్రీనాథ్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వస్తువుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి



నెహ్రూనగర్: తూనికల కొలతల్లో మోసాలకు గురి కావద్దని లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు సూచించారు. లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం గుజ్జనగుండ్లలోని డీ మార్ట్‌లో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులను కొనుగోలు చేసిన తరువాత ఆ వస్తువుపై ఉన్న సమాచారం తప్పనిసరిగా వినియోగదారులు తెలుసుకోవాలన్నారు. ప్యాకేజ్ కమోడిటీ యాక్ట్ ప్రకారం ఉత్పత్తిదారుడు పేరు, బ్యాచ్ నంబర్, ఆ వస్తువు ఎప్పుడు తయారు చేసిన తేదీ, వస్తువు రేటు పన్నులు అన్ని కలుపుకుని, ఎప్పటి లోపల ఆ వస్తువును ఉపయోగించాలని అనే తేదీ, కస్టమర్ కేర్ నంబర్, ఈ మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ఆహార పదార్థాలపై తప్పనిసరిగా పూర్తి వివరాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ జీ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జీ సునీల్‌రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీధికుక్కల పట్టివేత

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చేపట్టిన చర్యలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఉన్న వీధికుక్కలను పట్టుకుని ప్రత్యేక వాహనంలో బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డుకు తరలించారు. అక్కడ సంతానోత్పత్తి నియంత్రణ శాస్త్ర చికిత్సలు చేసి తరువాత వాటిని పట్టుకున్న చోటే వదిలిపెట్టనున్నారు.

పంపకాల ‘ఉపాధి’!

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంపకాలు జోరుగా సాగుతున్నాయి. ఇటు కూటమి నేతలు, అటు క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ పథకం కింద ప్రస్తుతం పంట కాల్వల పూడికతీత, ముళ్లకంపల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనుల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కూలీల వేతనాలకు గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

- కొందరు పనులకు రాకుండానే వచ్చినట్లు మస్టర్లు
- యథేచ్ఛగా ఫీల్డ్ అసిస్టెంట్‌ల అక్రమాలు
- బ్యాంకులో నగదు జమ కాగానే చెరి నగం స్వాహా
- కనీసం పట్టించుకోని ఉన్నతాధికారులు



ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు (ఫైల్)

నగరం: కూలీ పనులకు వచ్చిన వారికే అందుకు తగిన వేతనాలు ఇవ్వాలి. కానీ దీనికి విరుద్ధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులకు రాకపోయినా తమకు అనుకూలమైన వారి పేర్లను జాబితాలో చేరుస్తున్నారు. వారు పనులకు వచ్చినట్లు మస్టర్లు వేస్తున్నారు. వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాగానే సగం తీసుకుంటున్న ఘటనలు ఉన్నాయని అసలైన కూలీలు వాపోతున్నారు. వాస్తవానికి జాబ్ కార్డు ఉన్న వారికి మాత్రమే పనులు కల్పించాలి. వారు పని చేస్తున్న ప్రదేశానికి ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి ఆయా దృశ్యాలను ఎప్పటికప్పుడు సంబంధిత వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఒక ప్రదేశంలో నిర్వహించిన పనుల ఫొటోనే మిగిలిన అన్ని పనులకు అప్‌లోడ్ చేస్తున్నారు. పై స్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.

కూటమి వచ్చాక వివక్ష....

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలోని సుమారు 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించారు. కూటమి నేతల సిఫార్సుతో వారి స్థానంలో అనుకూలురైన వారిని నియమించారు. అప్పటి నుంచి ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.



పూడివాడలో అన్ని పనులకు ఒకే ఫొటో అప్‌లోడ్ చేసిన వైనం

> **అవినీతికి పాల్పడితే చర్యలు**
>
> ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదే. ఈ పనుల్లో అక్రమాలు జరిగినా, వివక్ష చూపినా మా దృష్టికి తీసుకుని వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
>
> – ఇన్‌చార్జి ఎంపీడీవో బి. శ్రీనివాసరావు

బాల్య వివాహాలతో అనర్థాలు



చిన్నారులను దీవిస్తున్న తల్లులు

రేపల్లె: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని సీడీపీఓ ఎం.సుచిత్ర చెప్పారు. కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అరవపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. మైనారిటీ తీరకుండా వివాహాలు చేయడం వల్ల చిన్న వయస్సులోనే గర్భం దాల్చి బాలికలు అనేక మానసిక, శారీరక ఇబ్బందులకు లోనవుతున్నారని తెలిపారు. దీని వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు తల్లీబిడ్డలు మత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నా గ్రామస్థాయిలో జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఈ సందర్భంగా మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లులతో చిన్నారులను దీవించే కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంరక్ష కార్యదర్శి ఆర్. సాయి ప్రియదర్శిని, ఏఎన్ఎం సీహెచ్ నాగేంద్రం, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రేపల్లె ఏరియా సమితి ఎన్నిక



గొట్టుముక్కల శ్రీమన్నారాయణ



పి.నాగాంజనేయులు



గొట్టుముక్కల బాలాజీ

రేపల్లె: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రేపల్లె ఏరియా సమితికి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన కమిటీ ఎన్నికల్లో 21 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. అధ్యక్షుడుగా గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షులుగా సమ్మెట శ్రీనివాసరావు, యార్లగడ్డ కనకదుర్గ, డి.కుసుమకుమారి, కార్యదర్శులుగా గుమ్మడి నాగమల్లేశ్వరమ్మ, కొలుసు నరేష్, కాగిత శ్రీనివాసరావు, డిప్యూటీ సెక్రటరీగా గాలి ఏసుదాసు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శిరంశెట్టి శ్రీనివాసరావు, వర్కింగ్ ఉమెన్ కార్యదర్శిగా జయమ్మ, కోశాధికారిగా పరుచూరి పద్మావతితో పాటు మరో 9 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేత కోటిరెడ్డి

భవనంవారిపాలెం (కర్లపాలెం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి కోరారు. భవనంవారిపాలెం గ్రామానికి చెందిన మున్నం నాగేశ్వరరావు, ఇటుకల రవీంద్ర, బుద్దుల కోటేశ్వరరావులు భవనంవారిపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై కోమలి వెళుతుండగా టిప్పరు ఢీకొంది. బైక్ రోడ్డుపై పడి ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సింధు, భర్త బాపట్ల నియోజక వర్గం బూత్ కమిటీల కన్వీనర్ దొంతిరెడ్డి కోటిరెడ్డిలు క్షతగాత్రులను పరామర్శించి జరిగిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతికి వివరించారు. కోన రఘుపతి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధార్థకు ఫోన్‌చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడైన బుద్దుల కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందోలు ఎస్ఐ ఎంవి శివకుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు రేపల్లె పట్టణం, రూరల్ పరిధిలోని గుడ్డికాయలంక, కారుమూరు, వేజెల్లవారిలంక, పాలకుర్తి గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. డిప్యూటీ ఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు.

మొగదారమ్మ తిరునాళ్ల ప్రారంభం



నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నంలో వేంచేసియున్న మొగదారమ్మ సిడిమాను, తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం రెండో రోజు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. జలక్రీడలు, పసుపు బండ్ల ఊరేగింపు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి ప్రదర్శించిన స్వాతిచినుకులు నాటకం ఆకట్టుకుంది.

కేఎల్‌యూలో జాతీయ స్థాయి సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎల్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్రహ్మణ్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో బీసీఏ, ఎంసీఏ విభాగాలు సంయుక్తంగా శుక్రవారం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బహుళ శాఖ పరిశోధనలపై జాతీయ స్థాయి సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య పి.సురేష్‌వర్మ, గౌరవ అతిథిగా ఎన్ఐటీ వరంగల్ ఆచార్యులు సురేష్‌బాబులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని.. వాటిని అందుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థికి ఉందని అన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. 200లకు పైగా విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు, ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించడానికి సురేష్‌వర్మ, సురేష్‌బాబులు అభినందించారని తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, ఎంసీఏ విభాగాధిపతి కిరణ్, బీసీఏ విభాగాధిపతి భగవాన్, సదస్సు కోఆర్డినేటర్స్ కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు రామకృష్ణ, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి



విభాగాధిపతులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలకు సంస్థకు సంబంధించి కోర్టు కేసులను ఈనెల 20 నాటికి విభాగాల వారీగా వివిధ పరిష్కారంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తమ చాంబర్‌లో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత విభాగాల వారీగా ఉన్న కేసులు, తీర్పు వచ్చిన కేసులు, పెండింగ్ ఉన్నవి వివరాలు తెలుసుకున్నారు. వివిధ అంశాలపై ఆయా సంస్థలు, వ్యక్తులు ఫైల్ చేసిన కోర్టు కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో అందించే ఆహారంపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం



లక్ష్మీపురం: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం హర్షణీయమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ చర్చావేదిక కార్యదర్శి, న్యాయవాది ఎ.హరి మాట్లాడుతూ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో, పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాలను, వాటి మౌలిక సదుపాయాలను దెబ్బతీసే లక్ష్యంతో సాయుధబలగాలు నిర్వహించిన ఆపరేషన్ దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపిందన్నారు. 26 మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమైన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల అంగీకారంతో కేంద్రం ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పాకిస్థాన్‌లోని సాధారణ ప్రజానీకానికి, సైన్యానికి ఎటువంటి హాని జరగకుండా దాడి కొనసాగించడం మంచి పరిణామమన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాల మారి పాకిస్థాన్‌కు, దానికీలుబొమ్మలైన ఉగ్ర మూకలకు ఆపరేషన్ సిందూర్‌తో భారత్ విషయం తెలిసొచ్చిందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు జనార్ధనరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంతో దేశంలోని 48 ప్రముఖ కంపెనీల ద్వారా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. శుక్రవారం వట్టిచెరుకూరు మడలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఎస్పీ సతీష్‌కుమార్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 30 జాబ్ మేళాలు నిర్వహించామని అన్నారు. దాదాపు 150 కంపెనీల ద్వారా 1536 మందికి ఉద్యోగాలను కల్పించామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో 48 కంపెనీలు 1426 ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ , ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆశయాల మేరకు 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు చక్కని అవకాశాలని అన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దుర్గాబాయి, ప్రత్తిపాడు తహసీల్దార్ దరియావలి, మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పెరుమాళ్లు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

> మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కార్యాలయ నమూనాను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: గాంధీ మార్కెట్‌లోని పై అంతస్థుల్లో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. శుక్రవారం ఆమె కమిషనర్ శేషన్నతో కలిసి మార్కెట్ భవనాన్ని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేయనున్న వివిధ విభాగాల కార్యాలయాల మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ జులై నాటికి తాత్కాలిక భవనంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. వివిధ విభాగాలకు అవసరమైన చాంబర్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా కమిషనర్ శేషన్న చెంచుపేటలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ సుబ్బారావు, టీపీవో సాంబశివరావు, ఆర్‌వో రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడిబోయిన రమేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సిబార్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం




విజేతలకు మెమెంటో కప్ అందజేస్తున్న డాక్టర్ త్రిమూర్తి

పెదకాకాని: క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం క్రీడా కార్యదర్శి డాక్టర్ ఈ త్రిమూర్తి అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ రోజూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడల అభివృద్ధికి సిబార్ చేస్తున్న కృషిని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా చివరి సంవత్సరం బీడీఎస్ విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణ మోహన్, స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్ ఎల్ ప్రణీత్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణారెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహారాణాప్రతాప్‌సింగ్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. రామరాజు ఇన్‌ఫ్రా డెవలపర్స్ రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి బి.జె.పి. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ మహారాణాప్రతాప్‌సింగ్ పేరు హిందువుల గుండెల్లో ఉత్సాహాన్ని కలిగించేదన్నారు. భావితరాలు ఆయన చరిత్రను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. బి.జె.పి.అర్బన్ జిల్లా మాజీ కార్యదర్శి రామకృష్ణ, నూతలపాటి తిరుపతయ్య, కె.శంకర్ సింగ్, ఎస్.కృష్ణసింగ్, మోహన్ సింగ్, తిరుప్పావై అమృతవర్షిణి, డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగనాయకి, షిండే లక్ష్మీనారాయణ, సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు మాట్లాడారు. అనంతరం పత్రి గాయత్రీదేవి భక్తి గీతాలు ఆలపించారు. డాక్టర్ రాజపుత్ర మధూరివిజేతసింగ్, బాణాల వెంకటసాయిమణికంఠ, రాజపుత్ర కార్తిక మధూరిసింగ్‌ను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు క్షత్రి ధర్మనారాయణసింగ్, ఏపీ చత్రపతి శివాజీ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జాజం సుబ్రహ్మణ్యం, బాణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి



కొల్లిపర: కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొల్లిపర పంచాయతీ కార్మికులతో కలిసి మే 20వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కామినేని లీలావతికి సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేత నం రూ.21,000 చెల్లించాలని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని నోటీసులో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, పంచాయతీ కార్మికులు గోదా సుందరావు, ఏసుపాదం, రమేష్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వేజండ్ల (చేబ్రోలు): ఆర్థిక సమస్యల కారణంగా ఓ యువకుడు గతనెల 28న ఎలుకల నివారణకు పెట్టే మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వేజండ్ల గ్రామానికి చెందిన తాటిమళ్ల సాయి(28) వ్యాపారం ఇతర కారణాల వల్ల ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. మనస్థాపానికి గురైన సాయి గతనెల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. మృతుడి తల్లి శివనాగమల్లేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

తెనాలిరూరల్: పట్టణంలో మూడు వ్యభిచార గృహాలపై పోలీసులు శుక్రవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ పాండురంగపేటలో ఓ ఇంట్లో వ్యభి చారం జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అలాగే చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లో మరో రెండు ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఐదుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.